

21న 'బరవే' రాష్ట్ర సాహిత్య సదస్సు

ప్రజాశక్తి-చాగల్లు

బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో జులై 21 ఆదివారం నిడదవోలులోని అంబేద్కర్ గ్రంథాలయంలో రాష్ట్రస్థాయి సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు నేలపూడి రత్నాజీ తెలిపారు. బహుజన రాజకీయాలు- సాహిత్యం- వర్తమాన సవాళ్లు అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సులో ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి- మిణుగురులు, మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం, డాక్టర్ నక్కా విజయరామరాజు - సుబ్బమ్మ మెస- బహుమతి పొందిన కథలు, నేలపూరి రత్నాజీ రచించిన ' జాగా లేని గాజా' దీర్ఘ కావ్యం పుస్తకాలను ఆవిష్కరిస్తారని తెలిపారు. వేదిక కార్యవర్గ సమావేశం, అనంతరం కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. కవులు, సాహిత్య వేత్తలు, సాహిత్యఅభిమానులు పాల్గొనాలని కోరారు. వివరాలకు 8919998753 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పాఠ్య పుస్తకాలు ఇస్తారా..?

- పుస్తకాలపై కొనసాగుతున్న ఉత్కంఠ
- బహిరంగ మార్కెట్లో రూ.వేలల్లో ధరలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీపై ఉత్కంఠ కొనసాగుతోంది. గత ప్రభుత్వం ఉచిత పుస్తకాల పంపిణీపై చేతులెత్తేసిన విషయం విదితమే. తాజాగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తరగతులు కూడా ప్రారంభం అయ్యాయి. అయితే ఇప్పటికీ నూతన ప్రభుత్వం ఉచిత పుస్తకాల పంపిణీ దిశగా అడుగులు వేయలేదు. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులలోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాల విభజన తర్వాత ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో స్టాక్ ఉన్న కొన్ని పుస్తకాలను అరకొరగా విద్యార్థులకు పంపిణీ చేసి రెండేళ్ల క్రితం అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కాలేజీలలో ఇంటర్మీడియెట్ విద్యాబోధన కుంటుబడింది. బహిరంగ మార్కెట్లో ఇంటర్మీడియెట్ పుస్తకాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.



బహిరంగ మార్కెట్లో రూ.2 వేల పై మాటే

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు జిల్లావ్యాప్తంగా 39900 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సుమారు 35 వేల మంది ఉన్నారు. వీరిలో 30 శాతానికి పైగా ప్రభుత్వ, సంక్షేమ కళాశాలలో చదువుతున్నారు. ప్రభుత్వం సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో గతేడాది సీనియర్ల వద్ద సేకరించిన పుస్తకాలను జూనియర్లకు అందజేశారు. గత లేని పరిస్థితుల్లో ఆ పాత పుస్తకాల ద్వారానే విద్యార్థులు పాఠ్యాంశాలను అభ్యసించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎపిఆర్‌జెసి, కెజిబివి, ఎపి మోడల్, సాంఘిక సంక్షేమ, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల ఉన్నాయి. ఆయా కళాశాలలో అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాల్సి ఉంది. జిల్లాల విభజన తర్వాత ప్రతిమండలంలో ఒక బాలికల జూనియర్ కళాశాలను (హైస్కూల్ ప్లస్) ఏర్పాటు చేశారు. వీటిలో చేరిన విద్యార్థులక్కూడా ప్రభు త్వమే ఉచితంగా పుస్తకాలు అందించాలి. దీనికితోడు జిల్లాలో ఇంటర్‌బోర్డు గుర్తింపు ద్వారా నడుస్తున్న ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, ప్రైవేట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు ముద్రించి విక్రయించాల్సి ఉంది. ప్రభుత్వ పంపిణీ చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడింది. పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు కలిపి సుమారు 2000 పైగా ఖర్చు అవుతుంది.

ఇంటర్మీడియట్ విద్యపై పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యం

విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నామంటూ పాలక ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు నేతి బీరచందంగా మారాయి. గత ప్రభుత్వం విద్యా దీవెన అమ్మ ఒడి పథకాల పేరుతో నగదు అందజేస్తున్నామంటూ ప్రచారం చేసి చేతులు దులుపుకుంది. ఇంటర్మీడియట్ విద్య అభ్యసనలో కీలకమైన పాఠ్యపుస్తకాలు అందజేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని అనుసరించింది. నూతన ప్రభుత్వమైనా చిత్తశుద్ధితో వ్యవహరించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్నాము

ఈ ఏడాది ఇంటర్మీడియట్ విద్యార్థులకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా నోటు బుక్స్ పంపిణీ జరుగుతోంది. అకాడమీ పుస్తకాలు, బ్యాగులు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రభుత్వం నుంచి విడుదల చేయగానే పంపిణీకి చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల పెంపునకు కృషి చేస్తున్నాము.

- నరసింహం, ఆర్‌ఐఒ, తూర్పు గోదావరి జిల్లా

ప్రాచుర్యం కలిగిన ప్రాంతాల అభివృద్ధి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరంలో ప్రాచుర్యం కలిగిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం నగరంలోని గౌతమి గ్రంథాలయం, టౌన్ హాల్, దామెర్ల ఆర్ట్ గ్యాలరీలను బుధవారం ఆయన సందర్శించారు. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రానున్న 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో పర్యాటక రంగం పరంగా, దర్శనీయ స్థలాలను గుర్తించి వాటి గుర్తింపు కోసం క్షేత్ర స్థాయిలో పర్యటించి అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. గౌతమీ గ్రంథాలయలో వివిధ పురాతన గ్రంథాలను కలెక్టర్ పరిశీలించారు. బ్రిటిషర్ మెకంజీ సంస్కతం, తెలుగులో రాసిన పుస్తకాన్ని, రాగి రేకుల ప్రతులను పరిశీలించారు. గౌతమీ గ్రంథాలయానికి పూర్వ వైభవం తీసుకుని రావడంతో పాటు మౌలిక సదుపాయాలు, మానవ వనరుల అభివద్ధి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ సమీపంలోని దామెర్ల ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. దామెర్ల ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించిన వివిధ చిత్రాలను పరిశీలించి, వాటి కళా నైపుణ్యాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరింతగా ఈ ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. గ్యాలరీ ఇన్చార్జి వి.నాగేశ్వరరావు కలెక్టర్‌కు వివరాలు వెల్లడించారు.



దామెర్ల ఆర్ట్స్ గ్యాలరీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని ఎపి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పి.సత్యనారాయణమూర్తి అన్నారు. పలు మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగుల సమావేశం బుధవారం మండలంలోని వేగేశ్వరపురంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు గత ప్రభుత్వ పాలనలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రతినెలా 1వ తేదీన పెన్షన్ అందించాలని, కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే డిఎ వెంటనే అందజేయాలని, మెడికల్ ఖర్చులు కింద ఇచ్చే మొత్తాన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలని, పెన్షనర్ చనిపోతే మట్టి ఖర్చుల కింద ఒక నెల పెన్షన్ అందజేయాలని, 12వ పిఆర్‌సి వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశం సందర్భంగా ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో 60 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంఘం కార్యదర్శి బిఎస్.ప్రకాశరావు, నాయకులు పిఎస్.ప్రసాద్ రావు, హెచ్‌ఎస్ వి.చంద్రయ్య, నాగేశ్వరరావు, తాళ్లపూడి, నిడదవోలు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, రాజమండ్రి, ధవళేశ్వరానికి చెందిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అసంపూర్తిగా భూగర్భ డ్రెయినేజీ

ప్రజాశక్తి-కడియం

గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో కడియం మండలం దుళ్ల గ్రామంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ అస్తవ్యాస్తంగా, అసంపూర్తిగా వదిలేయడంతో స్థానిక బిసి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భం నుంచి వాడకం నీరు పోయే పైప్‌లైన్లు ఎత్తు పల్లాలుగా వేయడం, డ్రెన్లు నుంచి మురుగు నీరు బయటకు పోయే అవుట్ లెట్‌లు ఏర్పాటు చేయకపోవడంతో తాత్కాలిక కచ్చా సంపుల్లో నీరు నిల్వ ఉంటోంది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయమై రాక పోకలకు ఆటంకం ఏర్పడుతోంది. అత్యధిక శాతం నిరుపేదలు, బిసి సామాజిక వర్గ ప్రజలు ఇప్పటికీ ఈ ప్రాంతంలో పెంకుటిళ్లలో నివసిస్తున్నారు. పాత ఇళ్లు కావడం, పల్లపు ప్రాంతం కావడంతో కొన్ని సందర్భాల్లో వర్షం నీరు ఇళ్ల లోనికి కూడా చేరుతోంది. కొన్ని వీధుల్లో రోడ్లపై నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. ఒక వీధిలోని సమస్యను స్థానిక నాయకులు జలగం గంగాధర్, నూలు ప్రసాద్ గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య దృష్టికి బుధవారం తీసుకునివెళ్లారు. స్పందించిన సర్పంచ్ తాత్కాలికంగా నీరు బయటకు పోయే ఏర్పాట్లు చేశారు. గతంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ప్రస్తుత ప్రభుత్వం లోనైనా పూర్తి చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ముంపులో బిసి కాలనీ

ఎంఎల్‌ఎ మద్దిపాటికి బాసటగా ఉద్యోగులు

ప్రజాశక్తి-నల్లజర్ల

గోపాలపురం నియోజకవర్గాన్ని అభివద్ధి చేయాలనే ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు ఆశయానికి తాము అండగా ఉంటామని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధి, వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ వెల్లడించారు. ఈ విషయమై ఎంఎల్‌ఎ వెంకట్రాజును అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో కలిసినట్టు తెలిపారు. నియోజకవర్గ అభివద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఎంఎల్‌ఎ తెలిపారనాన్నరు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సహాయ సహకారాలు అవసరమని, నియోజకవర్గ స్థాయిలో ఒక్కొక్క శాఖకు సంబందించి ఒకరు బాధ్యత తీసుకోనేలా స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎంఎల్‌ఎ ఉద్యోగులకు సూచించారని ప్రసాద్ చెప్పారు. అంకితబావంతో పనిచేసి ప్రజలకు సేవలందించడం ద్వారా అభివృద్ధి దానంతటదే సాధ్యమవుతుందని ఎంఎల్‌ఎ చెప్పారన్నారు. నల్లజర్లలో డిజిటల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అధికారులు, ఉద్యోగులతో తరచూ కాన్ఫరెన్స్‌లు నిర్వహించాలని చెప్పారు. దీని ద్వారా ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయంతో పాటు సత్సంబంధాలు పెరిగి ప్రజలకు ప్రభుత్వ ఫలాలను నూటికి నూరు శాతం అందించిన వారవుతామని ఉద్యోగులు సంఘం నాయకులు ప్రసాద్ తెలిపారు. చేస్తున్న ఉద్యోగానికి సేవాతత్పరత జోడిస్తే ప్రజల్లో ఉద్యోగుల పట్ల గౌరవ మర్యాదలు మరింత పెరుగుతాయని, ఆదర్శవంతులైన ఎంఎల్‌ఎ మద్దిపాటి సదాశయాలను నేరవేర్చిన వారమవుతామన్నారు.

సహజ వనరుల దోపిడీపై శ్వేత పత్రం

ప్రజాశక్తి-చాగల్లు

గత ప్రభుత్వంలో భూ దందాలు, సహజ వనరుల దోపిడీపై ప్రభుత్వం శ్వేతపత్రాలను విడుదల చేస్తున్నట్టు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. చాగల్లులో బుధవారం నాదల శ్రీరాం చౌదరి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసిపి పాలనలో భూ దందాలు, సహజ వనరుల దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఈ శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. వైసిపి పాలకులు ఏ విధంగా అక్రమాలు, దందాలు చేశారో, ఏంత దోచుకున్నారో ఆధారాలతో సహా శ్వేతపత్రాల ద్వారా బయటపెడుతున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్టు తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసిపి నేతలు భూదోపిడీకి పాల్పడ్డారన్నారు. ప్రైవేటు వ్యక్తిని ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్‌గా నియమించి పేద ప్రజల భూములను కొట్టేయాలని పన్నాగం పన్నారన్నారు. ఇంతటి ప్రమాదకరమైన చట్టాన్ని దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలు సైతం అమలు చేయలేదన్నారు. సొంతవారి కోసం రికార్డులు సష్టించే ఎత్తుగడకు పాల్పడ్డారని చెప్పారు. ఇళ్ల పట్టాల్లో వైసిపి నేతలు ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. వీరి దగ్గర నుంచి ప్రతి రూపాయి వసూలు చేసి ప్రజా ఖజానాకు జమ చేస్తామని ఎంఎల్‌ఎ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాదెల శ్రీరామ్ చౌదరి, తాలూరి ప్రసాదు, దొంగ రామకృష్ణ, ఈడుపుగంటి మురళి, బొడ్డు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎండిన చెట్టుతో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-గోపాలపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎండిన మామిడి చెట్టుతో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం ముందు పలు రకాలు చెట్లుల్ల, భారీ మామిడి వృక్షాలు ఉన్నాయి. అందులో ఒక మామిడి చెట్టు పూర్తిగా ఎండిపోయింది. దీంతో ఆ చెట్టు కొమ్మలు విరిగి పడుతున్నాయి. ప్రస్తుతం ఆ చెట్టు శిధిలావస్థలో ఉంది ఎప్పుడు పడిపోతుందో తెలియడం లేదు. గాలి వానలకు కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. అదే ఆవరణలో అనేక మండల కార్యాలయాలు ఎంఇఒ, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయం, డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయం, ఎన్‌ఆర్‌ఇజిఎస్, పంచాయతీ రాజ్ కార్యాలయం, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, సచివాలయాలు-1,2, ఒక ప్రభుత్వ పాఠశాల కూడా ఉంది. అందులో సుమారు 30 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. వీరితోపాటు జెడ్‌పిసిటి కార్యాలయం, ఎంపిపి కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలకు ప్రజలు నిత్యం అవసరతలకు వస్తూ ఉంటారు. అన్ని కార్యాలయాలకు ఆ చెట్టు మీదుగానే వెళ్లాల్సిన పరిస్థితి. అక్కడే ఉన్న పాఠశాలకు విద్యార్థుల సైతం ఆ ఎండిన చెట్టు పక్కనుండే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఆ చెట్టు ప్రమాదకరంగా ఉండడంతో భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఎండిన కొమ్ములు విరిగి పడుతున్నాయని తెలుపుతున్నారు. నిత్యం వందలాదిమంది కార్యాలయాలకు వస్తున్నారని, విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారని ఎప్పుడు విరిగి పడుతుందో ఎవరి మీద పడుతుందో తెలియని దుస్థితి ఏర్పడిందని అంటున్నారు.ప ప్రమాదం పొంచి ఉందని ముందుగానే అధికారులు స్పందించి ఇప్పటికైనా చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వెంకటేశ్వరరావు

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి నరసింహకిషోర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని స్థానిక కలెక్టర్ విడిది కార్యాలయంలో బుధవారం జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన డి.నరసింహ కిషోర్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కనును అందచేసారు. జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన నరసింహ కిషోర్‌ను కలెక్టర్ అభినందించారు. అనంతరం తూర్పు గోదావరి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, తదితర పలు అంశాలపై చర్చించారు.



కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి నరసింహ కిషోర్

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-నిడదవోలు


నిడదవోలు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం త్వరలో 100 పడకల ఆసుపత్రిగా మారనున్న దృష్ట్యా 'నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చెయ్యాలని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. దీనిపై రాంబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. డయాలసిస్ ఖరీదైన వైద్య ప్రక్రియ. కిడ్నీ సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో ఇలాంటి సమస్యలు వచ్చేవారు రాజమండ్రి, తణుకు తాడేపల్లిగూడెం వెళ్లాల్సి వస్తోంది. తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లో దాతల సాయంతో డయాలసిస్ కేంద్రాల్లో నడుపుతూ రోగులకు ఉచితంగా, తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తున్నారు. పట్టణంలో లయన్స్, రోటరీ క్లబ్ వంటి దాతృత్వ సంస్థలు ఉన్నాయని, అవి నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించాలని రాంబాబు విజ్ఞప్తి చేశారు.

జిపిఎస్ జిఒ రద్దు నిర్ణయం హర్షణీయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జిపిఎస్ అమలుపై విడుదల చేసిన జిఒను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం పట్ల యుటిఎఫ్ మండల అధ్యక్షుడు కుంకట్ల వెంకటరత్నం బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సిపిఎస్‌కు బదులుగా జిపిఎస్‌ను అమలు చేసేలా చేపట్టిన చర్యలను వ్యతిరేకించినట్లు తెలిపారు. ఇటీవల ఈ ప్రభుత్వంలో వ్యతిరేకించిన వెంటనే, ప్రభుత్వం రద్దు చేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయం ఉద్యోగులకు ఊరటనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వై.రాంబాబు, ప్రధాన కార్యదర్శి బెజ్జంకి రామారావు, మండల అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.తాతారెడ్డి, మండల గౌరవాధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ, మహిళా అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గోతులమయంగా ముక్కామల రోడ్డు

ప్రజాశక్తి-పెరవలి

ముక్కామల, ఉమ్మడివారిపాలెం, లంకమాలపల్లి, ఓదూరివారిపాలెం, బొక్కవారిపాలెం తదితర గ్రామాలకు జాతీయ రహదారి నుంచి వెళ్లే రోడ్డు భారీ వర్షాలతో గుంతలమయంగా మారింది. రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉంది. రోడ్డు గోతులు పడుతున్నా మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఆయా గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రం పెరవలి, తణుకు టౌన్ ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లే రోగులు, విద్యార్థులు బాలింతలు, గర్భిణులు స్త్రీలు రోడ్డుపై ప్రయాణం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని పలువురు వాహనదారులు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వర్షాలకు గోతులు మయంగా మారి రోడ్డు రోజురోజుకు బురదమయం అవుతున్న అడుక్కో గుంటగా వర్షం నీరు తలపిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. వర్షపు నీరు గోతుల నుంచి పక్కకు వెళ్లే విధంగా గాడులు తీసిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో రోడ్డు అభివద్ధికి నోచుకోక ఆయా గ్రామాల వాహనదారులు ప్రయాణికులు రోడ్డుపై ప్రయాణం చేస్తు ప్రమాదాల బారిన పడ్డారు. నిత్యం ఆయా ప్రాంతాల్లో ఉన్న వ్యాపారస్తులు, ఇతరులు జిల్లాలో ఇతర ప్రాంతాలకు వెళ్ళటానికి రోడ్డు మార్గం ఒక్కటే కావడంతో వర్షాకాలం రాత్రి వేళల్లో రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నుండి ఎర్ర వంతెన వరకు సుమారు 5 కిలోమీటర్ల రోడ్డు గజానికో గొయ్యి తలపిస్తోంది. గోదావరి లంక పరివాహక ప్రాంతాల్లో పండించే ఉద్యానవన పంటలు అరటి ఇతర కూరగాయ పంటలు వాహనదారులు రోడ్డు మీదగా జాతీయ రహదారికి వెళ్లి ఇతర ప్రాంతాలకు తరలిస్తారు.



గోతులుగా మారిన ముక్కామల రోడ్డు

డ్రెయినేజీ సమస్యకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-కడియం

మండలం వేమగిరి తోటలో నెలకొన్న డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి చొరవ తీసుకున్నారు. ఆయన సూచన మేరకు ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్, ఆర్డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసరావు ఈ డ్రైనేజీలను పరిశీలించారు. ప్రస్తుతం మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేనందున ట్యాంకర్ల ద్వారా ఆ నీటిని తోడే ఏర్పాట్లు చేయాలని ఆ గ్రామ ప్రత్యేకాధికారైన ఎంపిడిఒ రాజ్‌మనోజ్ పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ట్యాంకర్ ద్వారా మురుగునీటిని, డ్రెయినేజీలో ఉన్న పూడికను తోడి తరలించడం మొదలు పెట్టారు. ఈ ట్యాంకర్ ద్వారా డ్రెయినేజీ పూడికతీత సత్ఫలితాలు ఇస్తుడటంతో ఆ ప్రాంత ప్రజలకు కొంత ఊరట కలుగుతుంది. త్వరలోనే ఈ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి తగిన నిధులు మంజూరు చేస్తానని ఎంఎల్‌ఎ గోరంట్ల హామీ ఇచ్చినట్లు టిడిపి నాయకులు తెలిపారు.



డ్రెయినేజీల్లో సిల్టు తీస్తున్న వర్కర్



పనులను పర్యవేక్షిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ్

వేగేశ్వరపురంలో పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లపూడి

వేగేశ్వరపురంలో పంచాయతీ చేస్తున్న అభివద్ధి పనులను సబ్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాత్సవ బుధవారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. గ్రామంలోని మేదరపేటలో వర్షపు నీరు పోవడంతో పాటు పరిశుభ్రతపై గ్రామపంచాయతీ తాత్కాలిక పనులు చేస్తున్న నేపథ్యంలో కొందరు అధికారులకు చేసిన ఫిర్యాదు మేరకు పనులను పర్యవేక్షించేందుకు సబ్ కలెక్టర్ వచ్చారు. అభివద్ధి పనులకు ఎవరు ఆటంకం కలిగించకూడదని సబ్ కలెక్టర్ అన్నారు. ఎంపిడిఒ రమణ పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ సిబ్బందితో పనులు చేస్తున్నారు. సబ్ కలెక్టర్ వచ్చిన సమయంలో గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆర్‌ఐ కిషోర్ ఉన్నారు.

ప్రజాధనాన్ని దోచుకున్న వారిని వదిలేదు లేదు

ప్రజాశక్తి - కోటనందూరు

గత వైసిపి పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని, సహజవనరులను దోచుకున్న వారిని ఏ పరిస్థితుల్లోనూ వదిలేది లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మండలి ప్రతిపక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం తేటగుంటలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో కోటనందూరు, తుని పట్టణ, రూరల్ మండలాలకు చెందిన ముఖ్య నేతలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎంఎల్‌ఎ యనమల దివ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై దృష్టి సారించనున్నామని అన్నారు. సహజ వనరులను, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిని వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. ఎంఎల్‌ఎ యనమల దివ్య మాట్లాడుతూ మూడు మండలాల్లో ఉన్న ప్రధాన సమస్యలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని, వాటి ప్రాధాన్యతను బట్టి దశలవారీగా ఆ పనులు నిర్మాణం చేపడతామని అన్నారు. ఐక్యతతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, బాబు, అంకమరెడ్డి బుజ్జిబాబు, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు, చిత్రంలో ఎంఎల్‌ఎ దివ్య

డ్రెయినేజీల ఆక్రమణలను తొలగించాలి: కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో తక్షణమే డ్రెయినేజీల ఆక్రమణలను తొలగించాలని నగర కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. బుధవారం ఆయన మిలిటరీ రోడ్డులోని చీడిపోలు వద్ద డ్రెయిన్, డి-మార్ట్ ప్రాంతంలోని డ్రెయినేజీల వద్ద జరుగుతున్న పూడిక తీత పనులను పర్యవేక్షించారు. చీడిపోలు వద్ద ప్రధాన డ్రెయినేజీలో గుర్రపు డెక్క పేరుకు పోవడాన్ని గుర్తించి రెండు మూడు రోజుల్లో తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే డి-మార్ట్ ప్రాంతంలో కొంతమంది డ్రెయినేజీలపై సిమెంట్ స్లాబ్ లు వేయడంపై ఆయన మండిపడ్డారు. డ్రెయినేజీలపై వేసిన సిమెంట్ స్లాబ్‌లను ఒకటి రెండు రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో నగరపాలక సంస్థ తరపున తొలగించి అందుకు అయ్యే ఛార్జీలు వసూలు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. సర్పవరం జంక్షన్‌లోని నమ్మ టాయ్‌లెట్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ పర్యటనలో డిసిపి హరిదాస్, ఎంహెచ్‌ఒ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఇన్‌స్పెక్టర్ సత్తెప్ప నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


క్షేత్ర స్థాయి పరిశీలనలో ఆదేశాలు ఇస్తున్న కమిషనర్

విజయసాయి రెడ్డిపై జర్నలిస్టుల ఫిర్యాదు

ప్రజాశక్తి -గోకవరం

జర్నలిస్టులుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిపై బుధవారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్స్ బుధవారం గోకవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ ఫోర్త్ స్టేట్‌గా పిలవబడే జర్నలిస్టులను దుర్భాషలాడిన విజయసాయి రెడ్డిపై తక్షణమే కేసు నమోదు చేయాలన్నారు. అధికారులు, నాయకులు జర్నలిస్టులపై భవిష్యత్తులో ఎలాంటి సంఘటనలు పునరావత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రజకుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

రజకుల అభివద్ధి కోసం అనేక జిఒలు ఉన్నా ప్రభుత్వాలు వాటిని కింది స్థాయిలో అమలు చేయడం లేదని ఉమ్మడి గోదావరి జిల్లా రజక సంఘం నాయకులు చిలకల కట్లయ్య అన్నారు. ఆయన బుధవారం మండలంలోని తాళ్లపూడిలో రజకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ రజకుల కోసం చెరువులు తవ్వించడంతోపాటు ధోబీఖానాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్నిచోట్ల ఈ పనులు కానరావడం లేదన్నారు. గ్రామాల్లో రజకులను చిన్నచూపు చూస్తున్నారంటూ తమ న్యాయమైన కోరికలను రజకులు అందుకోలేకపోతున్నారన్నారు. రజకుల సంక్షేమం కోసం జిఒ నెంబర్ 62 ప్రకారం ప్రతి ఆరు నెలలకు జిల్లా స్థాయిలో నిర్వహించాలంటూ వీరి ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు గోపాలపురం ఎంఎల్‌ఎగా ఉన్న సమయంలో రజకులకు భవనాలు కట్టించి ఇచ్చారని, అందరు ఎంఎల్‌ఎలు వారి నియోజకవర్గాల్లో రజకుల అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలపై ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి-తాళ్లపూడి, చాగల్లు

రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ భద్రతతో పాటు టెండర్ విధానం రద్దు వంటి పలు సమస్యలపై గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంఎల్‌ఎ స్పందిస్తూ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు.

రాధాకృష్ణులకు వెండి కిరీటాలు

ప్రజాశక్తి -కడియం

కడియం మేకల దిబ్బ ప్రాంతంలోని ఆలయంలో రాధా కృష్ణులకు సూరపురెడ్డి పెదకాపు కుమారుడు వీర్రాజు, విజయలక్ష్మి దంపతులు బుధవారం వెండి కిరీటాలు బహూకరించారు. బుధవారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా సుమారు రూ.60 వేల విలువైన కిరీటాలను అందించి పూజలు నిర్వహించారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

నారాయణపురంలోని శ్రీగౌతమీ జీవ కారుణ్య వద్ధుల ఆశ్రమాన్ని కలెక్టర్ ప్రశాంతి బుధవారం సందర్శించారు. అక్కడ వృద్ధులతో మాట్లాడారు. ఆశ్రమం ఆవరణలో జామ మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వృద్ధులకు చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి బాగోగులు చూడాలని నిర్వాహకులకు సూచించారు. నిరాదరణకు గురుదైన వృద్ధుల పట్ల, అనాథ పిల్లల పట్ల మానవత్వంతో వ్యవహరించాల్సి ఉందన్నారు. వారికి మనం ఉన్నామనే భరోసా కల్పించి, మన వంతుగా చేయూతను అందించాలని తెలిపారు. ఆశ్రమ నిర్వహణ పట్ల మరింత జాగ్రత్త వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వద్ధాశ్రమంలో 66 మంది వృద్ధులతోపాటు 22 మంది అనాథ పిల్లలకు ఆశ్రయం ఇస్తున్నట్లు నిర్వాహకులు ఇఒ వి.పల్లంరాజు వివరించారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధుల కోసం పిల్లల కోసం దాతలు స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వడం, అన్నదానం చేయడం వంటి కార్యక్రమాలు స్వచ్ఛందంగా పాల్గొనడం జరుగుతుందని వివరించారు. వృద్ధులకు ఉదయం అల్పాహారం కోసం రూ.2 వేలు, ఒక పూట భోజనం కోసం రూ.4,500, అనాథ పిల్లల అల్పాహారం కోసం రూ.వెయ్యి, ఒక పూట భోజనం కోసం రూ.2,500 ఇస్తే వారి పేరున ఏర్పాట్లు చేస్తారని తెలిపారు.

ఎంఎల్‌ఎ వల్లే హాస్టల్స్‌లో సదుపాయాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఏగా ఎన్నికైన ఆదిరెడ్డి శ్రీనివాస్ వల్లే నెలరోజులు తిరగకముందే బిసి సంక్షేమ వసతిగృహాల్లో సదుపాయాలు కల్పించారని టిడిపి నాయకులు అన్నారు. వై.జంక్షన్‌లోని బిసి బాలుర వసతి గృహాన్ని బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా టిడిపి రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, బిసి సాధికార సమితి శెట్టిబలిజ విభాగం కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా మీడియాతో మాట్లాడారు. గత వైసిపి పాలనలో మాజీ ఎంపీ మార్గాని భరత్, మంత్రి చెల్లుబోయిన వేణు బిసి సామాజిక వర్గానికి చెందిన వారైనా కనీస సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. భరత్ తనకు ఆదాయం వచ్చే వాటిపైనే దృష్టి పెట్టి, పైపై మెరుగులకే ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి వాసు బిసి బాలుర వసతిగృహంలో 22 బాత్‌రూమ్‌లకు మరమ్మతులు చేయించారన్నారు. అలాగే గణేష్ చౌక్ వద్ద ఉన్న బిసి బాలికల వసతిగృహంలో 18 నుంచి 20 బాత్ రూమ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. ఇలాంటి చిన్న పనులు కూడా గత వైసిపి బిసి ప్రజాప్రతినిధులు చేయలేక పోయారని విమర్శించారు. టిడిపి పాలనలోనే బిసిలకు న్యాయం జరుగుతుందనే దానికి ఈ వసతిగృహాలే నిదర్శనమన్నారు. వారి వెంట టిడిపి నగర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి మరుకుర్తి రవి యాదవ్, కార్యదర్శి కిలపర్తి శ్రీను, నాయకులు కొల్లి బుజ్జి, రుంకాని విజయ్, కడియాల వీరభద్రరావు, చింతపల్లి నాని, శ్యామ్ కడియాల శ్రీనివాస్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బర్రే ఆనంద్‌కుమార్

గత కలెక్టర్ మాధవీలతపై ఫిర్యాదు చేస్తాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గత కలెక్టర్ కె.మాధవీలత అవినీతి, అక్రమాలపై నూతన ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్టు స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్)"ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బర్రే ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కలెక్టర్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా, మేజిస్ట్రేట్‌గా కాకుండా వైసిపి కార్యకర్తగా వ్యవహరించారన్నారు. అవినీతి, అక్రమాలకు తోడుగా నిలుస్తూ కొండలు, మెట్టలు, చెరువుల్లో మట్టి, ఇసుక వంటి సహజ సంపదను దోచి పెట్టడమే కాకుండా ప్రభుత్వ భూములను చాలావరకు అన్యాక్రాంతం చేశారన్నారు. అవినీతి అధికారులపై ఫిర్యాదు చేస్తే నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారన్నారు. ఈ మేరకు జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన మాధవీలత అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. రాజానగరం మండలం, శ్రీకష్ణపట్నంలో సుమారు 80 ఎకరాల సీలింగ్ భూమి నిరుపేదలకు చెందాల్సిందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ ఆ సర్వే నంబర్లను బ్లాక్‌లో పెట్టడం తప్ప అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. తక్షణమే ఆ భూమిని పేదలకు పంచాలని 2022 జూన్ 6న కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఆధారాలతో సహా ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ భూమిని గత కలెక్టర్ వారం రోజులకే ప్రయివేటు వ్యక్తికి ధారాదత్తం చేసే విధంగా మొత్తం సర్వే నెంబర్లను బ్లాక్‌లో నుంచి తీయించేశారని తెలిపారు. ఈ విషయమై విజయవాడలో సిసిఎల్‌ఎకి వెళ్లి స్పెషల్ ఛీఫ్ సెక్రటరీకి స్వయంగా ఫిర్యాదు చేశానని తెలిపారు. ఐటి సెల్ విభాగంలో వాటి వివరాలను పరిశీలించాల్సిందిగా, అసిస్టెంట్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారన్నారు. రెండు గంటల పాటు ఆ భూములు వివరాలను పరిశీలించినప్పటికీ, వాటి వివరాలు కనబడకుండా తీసేశారన్నారు. దీనిపై విచారణ చేస్తామని అధికారులు చెప్పారన్నారు. కాని ఆ తర్వాత రోజునే జక్కంపూడి రాజా రెవెన్యూ మంత్రి, సిసిఎల్‌ఎ అధికారులను కలిసినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. దీంతో విచారణ ఆగిపోయిందన్నారు. మూడు సార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఆ సీలింగ్ భూములను ప్రయివేటు వ్యక్తులకు అమ్ము కుంటున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని మునగాల కొండ, రఘుదేవపురం కొండ, నాగంపల్లి కొండ, నల్గొండ కొండ, రామచంద్రాపురం కొండ, కాటవరం కొండ, కోటి కేశవరం కొండ, ముగ్గుళ్ల నుంచి కూనవరం వెళ్లే దారిలో మెట్ట, జి.యర్రంపాలెం వద్ద ఉన్న కొండ ఇలా దాదాపుగా తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నా ఏ కొండను, మెట్టను వదిలిపెట్టలేదన్నారు. ప్రకృతి సంపదను మొత్తం వైసిపి నాయకులతో కలిసి దోచేశారన్నారు. ఎలాంటి అనుమతులు ఇవ్వలేని ఆర్‌టిఐ ద్వారా మైన్స్ శాఖ తెలిపిందన్నారు. ఈ విషయమై అప్పటి కలెక్టర్ మాధవిలతకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా 30 నుంచి 60 అడుగుల లోతులో చెరువుల్లో తవ్వకాలు చేశారన్నారు. మునగాల ఎస్‌సి పేటలో సోషల్ వెల్ఫేర్ భూమిని సైతం వైసిపి నాయకులకు అన్యాక్రాంతం చేసేలా సహకరించారన్నారు. అన్ని గ్రామాల్లోనూ రికార్డులను తారుమూరు చేసి విచ్చలవిడిగా భూ దందా చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఐఎఎస్ స్థాయి అధికారులు కూడా ఇంత నిస్సిగ్గుగా, చట్టాలకు భయపడకుండా వ్యవహరించడంపై జిల్లా ప్రజలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. నూతన ప్రభుత్వం సమగ్ర విచారణ చేయడానికి కమిటీ వేస్తే అన్ని ఆధారాలు సమర్పించడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. ఈ సమావేశంలో వి.శ్రీను, విజ్జిన వీర్రాజు, కొత్తపల్లి మహేష్, విజ్జిన రాంబాబు, దేగపాటి ప్రశాంత్ కుమార్, వేమవరపు రాజు, కాకి హనుమంతు, వందే లక్ష్మణరావు పాల్గొన్నారు.


పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ప్రారంభిస్తున్న డిఎస్‌పి లతాకుమారి

మహిళల రక్షణే ధ్యేయం : డిఎస్‌పి

ప్రజాశక్తి - జగ్గంపేట

మహిళలకు రక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ పని చేస్తుందని డిఎస్‌పి లతాకుమారి అన్నారు. బుధవారం మండలంలోని కాట్రావులపల్లిలో పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యధిక కేసులు కాట్రావులపల్లి గ్రామం నుంచి నమోదు అవుతున్నాయని అన్నారు. అందుకే ఎస్‌పి ఆదేశాల మేరకు పోలీస్ అవుట్ పోస్ట్‌ను గ్రామంలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈజ్ టీచింగ్, మహిళలకు ఎటువంటి హానీ జరగకుండా ఉండేందుకు పోలీస్ అవుట్ పోస్ట్ ఉపయోగపడుతుందన్నారు. పోలీస్ అవుట్ పోస్ట్‌లో జగ్గంపేట పోలీస్‌స్టేషన్ నుంచి ప్రతిరోజూ ఎఎస్ఐ, హెచ్‌సి, మరో ఇద్దరు స్టాఫ్ అందుబాటులో ఉంటారని తెలిపారు. కొన్ని రోజుల తర్వాత పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఎత్తివేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ లక్ష్మణరావు, ఎస్ఐ రామకృష్ణ, ఎఎస్ఐ నూకరాజు, పోలీస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ సుగుణ రావు, సుంకర సీతారామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రియాశీలక సభ్యత్వాల నమోదుకు కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి జనసేన కార్యకర్త క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయించేందుకు కృషి చేయాలని జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి పిలుపునిచ్చారు. స్థానిక జనసేన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి జనసేన కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మురంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జనసేన పట్టణ అధ్యక్షులు పొలమర శెట్టి సత్తిబాబు, ఒబిలిశెట్టి గణేష్, కటారి శ్రీను, మంచం సాయిబాబు, మడగల శ్యాం కుమార్, కొప్పిరెడ్డి నాగబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల రామస్వామి

పర్యావరణహితంగా పార్కును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వలసపాలక పార్కును పర్యావరణహితంగా అభివృద్ధి చేయాలని వార్డు మాజీ మెంబర్ మేడిశెట్టి వెంకటరమణ కోరారు. బుధవారం స్థానిక వలసపాకల పార్కులో వాకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్క్ స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసపాకల పార్కు అభివృద్ధికి పంచాయతీ రూ.40 లక్షలు ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటనలు వస్తున్నాయని, కానీ ఆ ప్రకటనలు ఆచరణలో అమలు కావడం లేదన్నారు. అసౌకర్యాలతో పార్కు ఉండటంతో వాకర్లు రాక, అవి అసాంఘిక కార్యకలాపాలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కు పరిస్థితిపై అధికార యంత్రాంగానికి ఎని దఫాలు వివరించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇప్పటికైనా అధికార యంత్రాంగం పార్కు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు స్థానిక ప్రజాప్రతినిధులు అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే పార్కు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జగన్నాథం, సత్యనారాయణ, శ్రీనివాస్, వీరబాబు, వీరభద్రం, సతీష్, గంగరాజు పాల్గొన్నారు.


చేసిన తీర్మాణం ప్రతిని చూపుతున్న పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు

అర్బన్ గ్రామాలకు విముక్తి కలిగించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నగరంలో విలీనం అయ్యే 8 గ్రామాలకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విముక్తి కల్పించాలని పౌర సంక్షేమ సంఘం కోరింది. బుధవారం వాకలపూడి యాదవ కళ్యాణ మండపంలో మాజీ సర్పంచ్ గింజాల శ్రీనివాసరావు అధ్యక్షతన పౌర సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పౌర సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ అర్బన్‌లో 8 గ్రామాలను కలపాలనే డిమాండ్‌తో రాజకీయాలకు అతీతంగా 8 గ్రామాల ప్రజలు అభిప్రాయాల కోసం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు ఈ సందర్భంగా ఆయా గ్రామాల అభిప్రాయాలను ప్రభుత్వ పెద్దలను కలిసి వివరించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మాణించింది. సమావేశంలో మండా సింహాద్రిరాజు, ఎం.సత్యనారాయణ, వీరగని వేంకటేశ్వరరావు, సిహెచ్ నల్లబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు నిర్భయంగా తెలియజేయండి'

ప్రజాశక్తి - పెద్దాపురం

బాలలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె స్థానిక నవోదయ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె బాల, బాలికలతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ సభ్యులు వివిధ పాఠశాలల సందర్శించి బాలల హక్కులపై వారికి అవగాహన కల్పిస్తున్నారన్నారు. సమస్యలు ఉన్నప్పుడు బాలలు ఆ సమస్యలను ఏ విధంగా, ఎవరికి తెలియజేయాలో బాలలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. సమస్యలను తెలియచేసినప్పుడే ఆ సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని గుర్తించాలని వివరించారు. ఈ పర్యటనలో నవోదయ వైస్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య, ఎంఇఒ ప్రభాకర్ శర్మ, స్కూల్ అసిస్టెంట్ రామలక్ష్మి, నవోదయ ఉపాధ్యాయులు జగన్మోహన్‌రావు, ఆర్.సత్యనారాయణ, ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ సనపల సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు ఆదిలక్ష్మి

యాత్రికులతో ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి - సామర్లకోట

తొలి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. విష్ణు, పాండురంగ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి రోజున కొత్తగా పెళ్ళైన జంటలను మరోమారు పెళ్లి కొడుకు, పెళ్లి కూతురుగా అలంకరించి ప్రత్యేక పూజాలతో, పిండి వంటలతో కుటుంబ సభ్యులు ఆనందంగా గడిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ, తిరిగి సాయంత్రం నుంచి రాత్రి వరకూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బైక్‌పై కూలిన చెట్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌టిఒ కార్యాలయ సమీపంలో బుధవారం ఒక చెట్టు కూలి మోటార్ బైక్‌పై పడటంతో బైక్ నడుపుతున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. స్థానిక మేదర వీధికి చెందిన సురేష్ మోటార్ బైక్‌పై తన స్నేహితుడిని బ్యాంకు కాలనీలో దించి తిరిగి వెడుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మోటార్ బైక్ ధ్వంసం కాగా సురేష్ స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోడి పందేలపై దాడి

8 మంది అరెస్టు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని వేల్ల చింతలగూడెంలో కోడిపందేల స్థావరంపై బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో 8 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. రూ.12,170 నగదు, రెండు కోడిపుంజులు, రెండు కత్తులు, 14 బైకులు సీజ్ చేసినట్లు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు.

యానాం వార్తలు


మునిస్వామిని సత్కరిస్తున్న నూతన కార్యవర్గం ప్రతినిధులు

డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న డ్రైవర్లు బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా యానాం ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా ఏలూరు శివప్రసాద్‌రావు, వైస్ ప్రెసిడెంట్‌గా శేరు కమల శ్రీనివాసరావు, సెక్రటరీగా కట్టా ఆనంద్, ట్రెజరర్‌గా అత్తిలి గోవిందరాజు, జాయింట్ సెక్రెటరీగా బల్లిపాటి మునసయ్య, సలహాదారుగా బొడ్డు నాగ సూర్యప్రసాద్, కమిటీ సభ్యులుగా శేరు వెంకటేశ్వరరావు, ఎనమదల రాంబాబు, సెమ్మ వీరవెంకటసత్యనారాయణ, చేటబల సుబ్బారావు, బేతంశ సత్యనారాయణ, మట్టపర్తి దుర్గాప్రసాద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నూతన కార్యవర్గం ఆర్ఏఒ మునిస్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

మత్స్యకారుల ఖాతాల్లో జీవన భృతి జమ

ప్రజాశక్తి - యానాం

చేపల వేట నిషేధం నేపథ్యంలో యానాంలోని 4,705 మంది మత్స్యకారులకు రూ.6,500 చొప్పున పుదుచ్చేరి ప్రభుత్వం జీవనభృతిని వారి ఖాతాల్లో జమ చేసినట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకులు డి గౌంతియ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంకా ఎవరికైనా ఈ సహాయం పొందని వారు ఉంటే ఈ నెల 22వ తేదీలోగా యానాం మత్స్యశాఖకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గృహ నిర్మాణ రుణాల నిధుల మంజూరు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి స్లమ్ క్లియరెన్స్ బోర్డు ద్వారా యానాంలో గృహ నిర్మాణం చేపట్టిన ఆయా లబ్ధిదారులకు నిధులు మంజూరు చేసినట్లు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు, మూడు విడతలకు సంబంధించి మొత్తం 61 మంది లబ్ధిదారులకు రూ. 88.20 లక్షల నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇందులో రెండో విడతలో 50 మంది లబ్ధిదారులకు రూ.80 లక్షలు, మూడో విడతలో 11 మంది లబ్ధిదారులకు రూ.8.20 లక్షలు మంజూరు కాగా ఆయా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు.